'మరి మీరేమంటారు?'

శ్రీదేవి బస్సులోంచి చెయ్యి బయటికి జాపి సూరిబాబు అందించిన వక్కపొడి పొట్లం అందుకుంది.

సూరిబాబు పొట్లం అందిస్తూ ఆమె చేతిని మృదువుగా నొక్కాడు.

ఆమె వంక దిగులుగా చూస్తూ, "ఇప్పుడు నీవు హైద్రాబాద్ కెళ్ళకపోతేనేం దేవీ!" అన్నాడు బరువుగా.

అతని వంక ముసిముసిగా చూస్తూ, 'వెళ్ళపోతే ఎట్లా దేవరా?" అంది తేలిగ్గా నవ్వేస్తూ.

మళ్ళీ కిసకిస నవ్వింది; నవ్వుతూ సీట్లోంచి ముందుకువంగి ముందున్న జడను వెనక్కేసుకుని మళ్ళీ వెనక్కి వాలుతూ బుక్‌స్టాల్ కేసి చూసింది.

ఆశ్చర్యంగా, "అరే అప్పుడే 'స్టార్ డస్ట్' కొత్తది వచ్చేసిందే!" అని "తీసికోండి!" అంది గోముగా.

సూరిబాబుకు ఆడంబరానికి అనవసరపు ఖర్చులు పెట్టటమంటే గిట్టదు. అందుకే, "మూడు రూపాయలు తగలేసి కొంటం దేనికి? ఎటూ మా ఆఫీసు 'బుక్ సర్కిల్‌కి' వస్తుందిగా, అప్పుడు చదువుదువుగాన్లే!" అన్నాడు.

చదివినా చదవకపోయినా ప్రయాణాలు చేస్తూన్నప్పుడు చేతిలో మేగ్‌జైన్లు - అందులో ముఖ్యంగా ఇంగ్లీషువి- పట్టుకోటం ఫ్యాషనూ, అవి అతనికి తెలియదు. కాని, అతని సతీమణికి తెలుసు. అతనికి తెలియకపోటాన్ని 'పిశనారి'తనంగా కట్టి, "ముష్టి మూడురూపాయలకు మీ ముల్లేం పోదులేండి!" అంది.

భార్య మూతి విరుపుకు ఏమనుకున్నాడో ఏమో మారు మాట్లాడకుండా వెళ్ళి పుస్తకం కొనుక్కొచ్చాడు.

పుస్తకం అందిస్తూ, "ఇంటర్‌వ్యూ కెళ్ళుతున్నదానికి జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవాలిగాని, ఈ మేగ్‌జైన్లా చదివేది!" అన్నాడు.

"ఎంత పిచ్చివారండి! ఉద్యోగాలు యిచ్చేది మన జనరల్ నాలెడ్జ్‌ని చూశా?" అంది.

సూరిబాబు కూడా నవ్వేడు. నవ్వటానికి నవ్వేడు గాని, మళ్ళీ వెంటనే బోలెడు దిగులు అతన్ని కమ్ముకుంది.

"ఆఫీసులో వెధవది ఈ ఇన్‌స్పెక్షన్ తగలడకపోతే నేనూ నీ వెంట వచ్చేవాడ్నే! పాపం, నీవు అక్కడ ఎంత యిబ్బంది పడతావో ఏంటో?" అన్నాడు దిగులుగా.

శ్రీదేవి గర్వంగా నవ్వేసి, "తెలియని వాళ్ళకిబ్బందిగాని, నాకేంటి? నేను బియ్యేని-" అంది.

"అప్పుడే కాదు. ఇంకా రెండు పార్టులు మిగిలిపోయాయి - మర్చిపోయావా?" అన్నాడు.

ఆ మాటకి శ్రీదేవికి కోపం వచ్చింది. ఆమె కొనదేలిన ముక్కుమీదికి వంటికాలి మీద వచ్చిన కోపంకు కూడా అందం వచ్చేసింది. ఆమె మూలంగా ఆ సూపర్ డీలక్సు బస్సుకు కూడా బోలెడు అందం వచ్చేసింది. బస్సులోకి కాలుపెట్టిన ప్రతివారూ ఆమె మీదనుంచి కళ్ళు తిప్పుకోలేక పోతున్నారు. అందుకు కారణం ఖరీదైన కాశ్మీరు సిల్కుచీరలో, మెళ్లో ముత్యాల గొలుసుతో, చెవులకు ముత్యాల దుద్దులతో ఒక చేతికి ఖరీదైన రిస్టువాచీతో, మరోచేతికి మూడు జతల బంగారు గాజులతో ఆమె ధగధగ లాడిపోవటమే కాదు; పోతపోసిన దేవతావిగ్రహంలాగా ముందు వరుస సీట్లో కాలుమీద కాలేసుకొని యువరాజ్ఞి ఠీవితో కూర్చున్న ఆమె అందం కూడా కారణమే!

ఇంతలో సూపర్ యూనిఫారంలో సూపర్‌మేన్ ఫోజులో బస్సెక్కిన డ్రైవరు మరో అయిదు నిమిషాలల్లో గణగణా గంటకొట్టి బస్సును స్టార్టుచేసి, 'రైట్‌కు కోసి' అవుట్ గేట్‌లోంచి బయటికి దూసుకు పోయాడు.

సూపర్ డీలక్సు చుట్టూ తిరిగి వచ్చే సరికి సూరిబాబు ఫైర్‌స్టేషన్ దగ్గర సైకిలు పట్టుకుని నిలబడి మళ్ళీ ఇంకోసారి చెయ్యివూపి శ్రీదేవికి 'టాటా' చెప్పాడు.

కనకదుర్గ గుడి దీపాల్ని చూచి కళ్ళుమూసుకుని మనస్సులోనే మ్రొక్కుకుంది. తనకీ ఉద్యోగం వస్తే ఆమెకు కుంకుమపూజ చేయిస్తానంది; వంద కొబ్బరికాయలు కొట్టుతానంది; లక్షపత్రి పూజ చేయిస్తానంది.

తనకు రాబోయే ఈ ఉద్యోగానికి జీతం నెలకు మూడొందలఏభై పైనే వస్తుందంట. తను ఉద్యోగం చెయ్యటం సూరిబాబుకి సుతారమూ యిష్టంలేదు. నీవు ఉద్యోగం చేయవల్సిన ఖర్మ మనకేంటి? మనకేం తక్కువయిందనీ; నాకు వచ్చే జీతం మనకు సరిపోదా. మనకు పోగంపెడు పిల్లలు వున్నారనా, వాళ్ళను పోషించలేమనా ఎందుకు తాపత్రయం- అని అంటాడు. నిజమే ఏమీ తక్కువ కాలేదు. ఆయనకు జీతం నెలకు ఆరొందలు పైనే వస్తుంది. ఎంత జల్సాగా ఖర్చు చేసినా ఇంకా వందా రెండొందలు మిగులుతాయి కూడా. ఇక పిల్లా పీచూ మాటకొస్తే ప్రస్తుతానికి ఎవరూ లేరు. (పెళ్ళయి ఇంకా రెండేళ్ళు కాలేదు. కాబట్టి తనకా కంగారు లేదు!)

అలాగని అదనంగా నెలకు మూడు నాల్గొందలు వస్తూంటే చేదా? బంగారంలాంటి ఉద్యోగం కాళ్ళదగ్గరకు వస్తుంటే వద్దంటామా? నెల నెలా వచ్చే ఈ డబ్బులతో ఎన్నో కొనుక్కోవచ్చు. ఇంకా ఎంతో జల్సాగా, దర్జాగా, ఆడంబరంగా బ్రతకవచ్చు. డబ్బుచేదా?

ఇలా ఆలోచిస్తుంటే శ్రీదేవికి సైకిలు పట్టుకుని రోడ్డువారే నిలబడ్డ భర్తా, అతని చేతిలోని సైకిలూ గుర్తుకు వచ్చాయి.

ఆ సైకిలుకు (అవ్వటానికి కొత్తదే! ఈ మధ్యే అయిదొందలు పెట్టి కొత్తది కొన్నాడు) బదులు ఏ స్కూటరో పట్టుకుని వుంటే ఎంత బాగుంటుంది! ఎంత డాబుగా వుంటుంది!

తనకీ ఉద్యోగం రాగానే వాయిదాల పద్ధతి మీద ఒక స్కూటర్ కొనేయాలని అప్పటికప్పుడు నిశ్చయించుకుంది. ప్రతినెలా తనకొచ్చే జీతం డబ్బులు కట్టేస్తే ఒక్క ఆర్నెల్లల్లో అప్పు తీరిపోతుంది. రోజూ స్కూటర్‌మీద యిద్దరమూ ఆఫీసుకెళ్ళవచ్చు. షాపింగ్‌కూ, సినిమాలకూ, గుళ్ళకు గోపురాలకూ, విందులకు వినోదాలకూ 'జుఁయ్'మంటూ వెళ్ళవచ్చు.

తన జీతం డబ్బులతో ఇంకా ఏ(వేమి కొనాలా అని ఆలోచించింది. గాడ్రేజ్ బీరువా, సీలింగ్ ఫాన్, ఖరీదైన రేడియోసెట్టు, రోజ్‌వుడ్ టాయిలెట్ టేబిల్, స్ప్రింగ్ మంచాలు, డన్‌లప్ పరుపులూ, బాయిలర్, గ్యాస్‌పొయ్యి, స్టీలు సామాన్లూ - ఇవన్నీ ఉన్నవే! వీటిలో కొన్నింటిని తన పుట్టింటివాళ్లు యిచ్చారు. మరికొన్ని భర్త జీతంలోంచి కొన్నవి. సొంత ఇల్లూవాకిలీ వుంది; అతని తాత తండ్రులు సంపాదించి యిచ్చింది. కట్నం క్రింద తన వాళ్ళిచ్చిన ఆరెకరాల మాగాణి కూడ వుంది.

ఇంతలో, "నీవూ హైదరాబాదుకేనా పాపా?" అని ప్రక్కన కూర్చున్న ముసలమ్మ మెల్లగా తనని మాటల్లోకి దింపింది.

తనకు చిరాకనిపించింది. తానేదో సీరియస్‌గా ఆలోచించుకుంటూంటే తనని అనవసరంగా డిస్టర్బ్ చేస్తూన్న ఆ ముసలమ్మ మీద కోపంకూడా వచ్చేసింది. పైకి ఆమె అడిగిన వాటికి పొడిపొడిగా సమాధానాలు చెప్పింది.

"దొంగలు బస్సులని దోచుకుంటున్నారంటగా పాపా!" అంది. ఆ ముసలమ్మ మెళ్ళో బంగారుకంటెను భయం భయంగా చేత్తో తడుముకుంటూ.

"ఏమో, నాకు తెలియదు-" అని సీట్లోకి జారగిలపడి కూర్చుంది. ఆ ముసలమ్మతో మాట్లాడడం యిష్టంలేక కళ్ళు మూసుకుని నిద్రబోతున్నట్లు నటించింద. నిజంగానే మరి కాసేపటికి కలతనిద్రలోకి జారిపోయింది.

కలత నిద్రలోనే శ్రీదేవికి ఆల్విన్ కంపెనీ వారి అందమైన చిన్న ఫ్రిజ్ కనిపించింది. అలాంటి ఫ్రిజ్‌ను ఈ మధ్యనే తన బంధువులింట్లో చూసింది. అందులోంచి కూల్‌డ్రింక్ తీసి తనకిచ్చారు. కూల్‌డ్రింగ్ త్రాగుతూ అలాంటిది తనకు కూడా వుంటే ఎంత బాగుంటుందని మనస్సులో అనుకుంది.

..... బస్సు కుదుపుల్లో కలతనిద్ర కాస్తా చెరిగిపోయింది. కాని ఆ ఫ్రిజ్ బొమ్మ మాత్రం మనస్సులోంచి చెరిగిపోలేదు. తనకు ఉద్యోగం వచ్చిన తర్వాత అలాంటి ఫ్రిజ్ కొనుక్కోవాలనుకుంది. దాన్తోపాటు రేడియోగ్రాం, బట్టలు వుతికే మిషన్, పిండి రుబ్బే మిషన్, రవ్వల సెట్ - ఇలా ఎన్నో ఐటమ్స్ తన బంధువుల ఇళ్ళల్లోనో, ఫ్రెండ్సు ఇళ్ళల్లోనో చూచినవన్నీ ఆ క్షణంలో తన కళ్ళముందు కనిపించాయి. మనస్సులోనే ఒక పెద్ద లిస్టు తయారయింది. ఆ లిస్టును ఒక్కసారి క్రిందనుంచి పైకి చూచి, అమ్మో! అన్ని వస్తువులు తనకు లేవా అనుకుంది. ఇప్పటివరకు తనకన్నీ వున్నాయే అనుకుంది. తనకు లేనివి ఇంకా ఎన్నో వున్నాయని ఇప్పుడే తెలుసుకుంది - తనెంతో తక్కువ స్థితిలో వున్నాననుకుంది. తను ఎంతో హీనస్థితిలో వున్నట్లు చిత్రించుకుంది. తను అనుభవిస్తున్న 'దారిద్ర్యాన్ని' రకరకాలుగా ఊహించుకుని కుమిలిపోయింది. తనంత దురదృష్టవంతురాలు తను తప్ప ఇంకెవరూ వుండబోరనుకుంది.

తన మీద తనకు చిరాకేసింది. తన భర్తమీద చిరాకేసింది. అసలు తను ఉద్యోగం ఎప్పుడో చెయ్యవల్సింది. ఇప్పటికయినా చేయబోతున్నాను. ఇది మేలే అనుకుంది - ఇలా అనుకుంటూ మళ్ళీ నిద్రలోకి జారిపోయింది.

* * *

తలుపు తెరచి ఎదురుగా శ్రీదేవిని చూచి చాల ఆశ్చర్యపోయాడు సీతాపతి.

మీటర్ చార్జీ మీద ఒక రూపాయి అదనంగా 'టిప్' యిచ్చేసరికి టాక్సీ డ్రైవరు చాల సంతోషించాడు. తనే సూట్‌కేస్ తెచ్చి లోపలపెట్టి సలాం చేసి వెళ్ళిపోయాడు.

"ఏంటి, ఉత్తరం పత్తరం లేకుండా ఇలా ఊడిపడ్డావ్?" అన్నాడు సీతాపతి.

"ముందుగా లెటర్ వ్రాయటినికి టైం లేకపోయిందన్నయ్యా!" అని తనొచ్చిన పని గురించి చెప్పింది.

"అయితే నీవూ ఉద్యోగం చేస్తావన్నమాట!" అని నవ్వి సూట్‌కేస్ లోపల పెట్టబోయి తనచేతులవంక చూచుకున్నాడు.

చేతులనిండా మసి వుంది. బాయిలర్‌లో బొగ్గువేస్తూ వచ్చాడు. మసిచేతులు శ్రీదేవికి చూపించి, ఆమెతోపాటు తనూ నవ్వేడు.

సీతాపతి తన పిన్ని కొడుకు. హైద్రాబాద్‌లో ఏదో ప్రైవేటు కంపెనీలో ఆఫీసరుగా పనిచేస్తున్నాడు.

"వదిన ఏది?" అంది.

"ఇంకా నిద్ర లేవలేదు." అని అంటుండగా అతని భార్య అరవింద చంటిపిల్లను ఎత్తుకుని బయటికి వచ్చింది. నవ్వుతూ శ్రీదేవిని పలకరించింది.

"ఇదేనా మొన్న రిలీజయిన కొత్త బొమ్మ!" అంటూ పాపను ఎత్తుకుంది శ్రీదేవి.

"మొదటి బొమ్మ కూడా ఇదే!" అని సీతాపతి నవ్వుతూ బాయిలర్ వెలిగించటానికి దొడ్లోకి వెళ్ళాడు.

"పాప డల్‌గా ఉందేం వదినా?"

"రాత్రంతా ఊరికే ఏడుస్తూనే ఉంది." రాత్రంతా నాకూ దానికీ నిద్రలేదు. మీ అన్నయ్య మాత్రం గురకపెట్టి మరీ హాయిగా నిద్రపోయాడు" అంది నవ్వుతూ.

గడియారంలో ముళ్ళు కదులుతున్న కొద్దీ ఆ ఇంటిలో హడావుడి జాస్తి అయింది. పాత్ర సామానుల చప్పుళ్ళూ, విసుక్కోవటాలు, కసురుకోవటాలు, పాప ఏడ్పూ, గదమాయింపులూ - అదంతా ఒక పెద్ద సీనులా వుంది.

సీతాపతి ఉదయం తను వచ్చినప్పుడు బాయిలర్‌లో బొగ్గు వెయ్యడమే కాదు. భోజనాలు చేసి ఆఫీసుకెళ్ళే లోపల ఎన్నో మొగపనులూ, ఆడపనులూ తనే చేస్తూ ఈ గదిలోంచి ఆ గదిలోకి, ఆ గదిలోంచి ఈగదిలోకి బొంగరంలాగా తిరుగుతున్నాడు. అరవిందకు పాప సవరింపుతోనే సరిపోతుంది. అతనికి ఉదయం పేపరు చదవటానికి కూడా క్షణం తీరికవుండదు.

తను కాఫీ త్రాగుతూ బద్ధకంగా ఆవులిస్తూ పేపరు తిరగేస్తూ కూర్చుంది. అతను హడావుడిగా అటొచ్చీ ఇటొచ్చీ - కిసింగర్ ఢిల్లీలో దిగేడా, ఇంతకీ మన మొగాన ఆహార ధాన్యాలు పడేస్తానంటున్నాడా లేదా - అని అడుగుతూ తనని పలకరిస్తోన్నాడు.

అతడ్ని చూస్తుంటే తనకు నవ్వూ, జాలీ కూడ కలుగుతున్నాయి. ఇంత ఎవ్వర్ బిజీమేన్ - అతను లోగడ చదువుతున్న కాస్టింగ్ పూర్తిచేసి వుంటాడా అని అనుమానం వచ్చింది. అదే అడిగింది.

అప్పుడతని చేతిలో పప్పుతెడ్డు వుంది. "కాస్టింగ్" పోయి, ఇదిగో ఈ తెడ్డింగ్ వచ్చింది" అని నవ్వుతూ తెడ్డు చూపిచాడు.

మళ్ళీ అన్నయ్యే అన్నాడు. మీ వదిన జాబులో చేరాక అంతకుముందు చదువుతున్న కాస్టింగ్ మానేశాను. అది పాసయి వుంటే ఇంకా పెద్ద ఆఫీసరు పోస్టు వచ్చివుండేది...."

అరవింద రుసరుసలాడుతూ, "వదిన జాబులో చేరింది కాబట్టే మీ అన్నయ్యకు 'రాజ్‌దూత్' వచ్చిందమ్మాయి!" అంది.

అప్పుడు తను ముందుగదిలో (టార్పాలిన్) ముసిగేసి వున్న మోటర్ సైకిల్ను చూచింది. ఒక చిన్న రధం లాగా ముచ్చటగా వుంది. తనూ సూరిబాబుకు ఇలాటిదే కొనిపించాలి. వెధవ స్కూటర్ దేనికి అనుకుంది.

గంట తొమ్మిది కొట్టేసరికి యిద్దరూ ఆఫీసుకు బయలుదేరారు. చెరొక టిఫిన్ కారియర్‌లో అన్నం పెట్టుకున్నారు. అరవింద తనకు భోజనం వడ్డిస్తానంది. తనప్పుడేవద్దు, తర్వాత తింటానంది. ముగ్గురూ సీతాపతి చేసిన వుప్మా తిని మరో విడత కాఫీలు త్రాగారు.

సీతాపతి డూప్లికేట్ తాళం చెయ్యి యిచ్చి, "నీవు బయటికి పోవాలంటే ఇంటికి తాళం వేసిపో", అని తనతో చెప్పాడు.

"ఇంటర్‌వ్యూ రేపుగా, ఇవాళ్ళంతా రెస్టు తీసుకోనీయండి!" అంది అరవింద.

సీతాపతి తన రధాన్ని తీసి బయట యింటిముందు పెట్టాడు.

అరవింద ట్రిమ్‌గా తయారయి కళ్ళకు జోడు తగిలించుకుని, ఒక భుజాన వేనిటీబాగ్ తగిలించుకొని, మరో భుజాన ఆ ఆర్నెల్ల పాపను వేసుకుని, ఒక చేత్తో టిఫిన్ కారియర్ పట్టుకుని పొరుగూరుకు ప్రయాణమైనట్టు బయలుదేరింది.

"పాపను కూడా ఆఫీసుకు తీసుకెళ్లుతావా?" తను అమాయకంగా అడిగింది.

అరవింద నవ్వి "మా ఆఫీసుకు దగ్గర్లోనే ఒక 'ఛైల్డ్ కేర్' సెంటర్ వుంది. అందులో వదిలేస్తా," అంది.

"పాప నలతగా వుందికదా వొదినా పోనీ ఈ రోజుకు శలవు పెట్టక పోయావా?"

"శలవులన్నీ డెలివరీకి లాగేసింది. మళ్ళీ ఇప్పుడు శలవు పెట్టితే జీతం కట్!" అన్నాడు సీతాపతి.

తీరా బయలుదేరబోయేముందు అరవింద, "అయ్యో మరచిపోయా!" అని మళ్ళీ లోపలికి వచ్చింది.

కారియర్ క్రిందపెట్టి, కుర్చీలో కూర్చుని జాకెట్ గుండీలు విప్పి పాపకు పాలు ఇవ్వటం మొదలుపెట్టింది. సీతాపతి టైం అయిపోయిందంటూ చిందులు త్రొక్కుతున్నాడు.

"మధ్యలో పాపకు పాలు కావాలంటే ఎలా వదినా?"

"మధ్యలో రెండుసార్లు వెళ్ళి నా పాలు ఇచ్చి వస్తూ వుంటా. అంతకీ ఏడుస్తే ఆయా డబ్బా పాలు పట్టుతుంది. రోజూ ఉదయం, సాయంత్రం, ఆఫీసు టైంలో సెంటర్‌కెళ్ళుతున్నానని మా ఆఫీసర్ వూరికే మండిపడుతున్నాడు" అంది అరవింద.

ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళకు పసిపిల్లలుంటే కష్టమే అనుకుంది. యింట్లో ఎవరన్నా ముసలమ్మలుంటే ఫర్వాలేదు. కొంతవరకు అనుకుంది, అదే అరవిందతో అంటే ఆమె నవ్వి, "మనం వుద్యోగాలు చేస్తున్నామని చచ్చి స్వర్గాన వున్న మామ్మలు రావాలీ ఇక" అంది బ్లౌజు గుండీలు తిరిగి పెట్టుకుంటూ.

టాటాలు అయినాక 'రాజదూత్' దూసుకుపోయింది.

శ్రీదేవి తలుపువేసి లోపలికి వచ్చింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. జడివాన కురిసి వెలిసినట్లయింది. బిక్కుబిక్కు మంటోంది. ఆమెకు ఏమీ తోచలేదు.

కాసేపు రేడియో పెట్టుకుని కూర్చుంది. వూరికే ఆవలింతలు వస్తూ వుంటే స్నానం చేద్దామని చీరా, టవల్ తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళింది.

బాత్‌రూం వెనుకవైపు దొడ్లో ఉంది. అది అందరికీ కామన్ బాత్‌రూం లాగా వుంది. దానికి ఆనుకుని వేరే చిన్న పెంకుటింటి పోర్షన్ వుంది. ఆ యింటికీ దీనికీ మధ్య గోడే అడ్డు. ఆ యింటిలోవాళ్ళు మాట్లాడుకునే మాటలన్నీ బాత్‌రూంలోకి స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"అమ్మా ఈ పూటకు బియ్యంలేవే!" ఒక యువతి కంఠం వినిపించింది.

వాళ్ళ అమ్మ రోగిష్టి మనిషిలాగా వుంది. వూరికే దగ్గుతూ, ఆయాసపడుతూ, "బియ్యంలేకపోతే ఏంచేస్తావు! నాలుగు రొట్టెలన్నా చేసి పడేయ్. మాయదారి మంద వున్నారుగా నా ప్రాణానికి. తలా వొక రొట్టె తిని ఇన్ని నీళ్ళుత్రాగిపడి వుంటారు-" అంది.

"పిండికూడ లేదు" అంది ఆమె కూతురు.

"లేపోతే దేంట్లోనన్న పడి చావండి పీడా విరగడయిపోతుంది. లేపోతే ఇంత ఎలుకల మందు నీళ్ళల్లో కలిపి తలా ఒక గ్లాసు త్రాగించి - అంతా కట్టకట్టుకుని చద్దాం-"

మిగతా మాటలు దగ్గుతెర మాటున అణిగిపోయాయి. కంగు కంగున దగ్గి ఆయాసపడుతూ మళ్ళీ, "అమ్మా, నాయన.....ఓరి దేముడా, ఆ చచ్చినోడితోపాటు నన్నూ తీసుకపోతే నాకీ కష్టాలుండేవి కాదుగదరా తండ్రీ!" అంది.

"అమ్మా, నీవు అనవసరంగా మాట్లాడకు - వూరికే ఆయాసపడుతూ, ఈ పూటకు నేనేదో చేస్తాలే!"

"ఏం చేస్తావే తల్లి? తొలిచూలువు నీవు ఆడముండవయిపోయావు - అదే ఏ మొగ వెధవో అయివుంటే మనకిన్ని కష్టాలుండేవి కావు." అంది ఆ రోగిష్టామె.

ఇంతలో చిన్నపిల్లలు కాబోలు కొట్టుకుని యిల్లంతా ఎగిరిపోయేటట్లు ఏడుస్తున్నారు.

శ్రీదేవికి చాలా చిరాకనిపించింది. హాయిగా స్నానం చేద్దామని వస్తే ఇదెక్కడి పీడరా బాబు అని విసుక్కుంది. వేడి వేడి నీళ్ళు కాని, ఫారిన్ సబ్బు వెదజల్లే ఆ సువాసనలు గాని ఆమెకు సేదగలిగించ లేదు. పక్కింటి భాగవతంతో ఆమె మనస్సుకు అలసట ఇంకా ఎక్కువయింది. గబగబా రెండు చెంబుల నీళ్ల దిమ్మరించుకుని వచ్చేసింది.

భోంచేస్తూ ఈ పూట ఆ యింట్లో వాళ్ళు ఏమి తిన్నారో అనుకుంది. అన్నం సహించలేదు. చెయ్యి కడుక్కుని మంచం మీద వాలిపోయింది. గాఢనిద్ర పట్టేసింది.

..... ఎవరో బయట తలుపులు బడబడా బాదుతున్న శబ్దానికి శ్రీదేవికి మెలకువ వచ్చింది. కళ్ళు తెరచి చూచింది. చేతి వాచిలో టైం నాల్గున్నర గంటలే అయింది. అరవింద వాళ్లు అయిదున్నర దాటితేగాని రామని చెప్పారు. మరి తలుపు కొట్టుతోంది ఎవరా అని ఆశ్చర్యపోయింది.

బద్ధకంగా ఆవులిస్తూ లేచి వెళ్ళి తలుపు తెరచింది. ఎదురుగుండా అరవింద.

"అన్నయ్య ఏడి?"

"నేనే ముందు వచ్చేశాను."

"పాపకెలా వుంది వదినా?" కంగారుగా అడిగింది.

"నాకే బాగాలేదు. పాప బాగానే వుంది?" అని లోపలికి వచ్చి మంచం మీద వాలిపోయింది. తలనొప్పి, జ్వరం ముంచుకు వచ్చాయి.

"పొద్దున బాగానే వున్నావుగా వదినా, ఇంతలో ఇలా అయిందేంటి?"

"ఆఫీసులో గొడవ జరిగిందమ్మాయి అదంతా తర్వాత చెప్తుతాగాని, ప్లీజ్, నీవు కాస్త టీ చేసి ఇవ్వగలవా? అలాగే అలమారులో శారిడాన్ ఉంది ఇవ్వు," అందివుస్సూరుమంటూ.

శ్రీదేవికి అంతా అయోమయంగా వుంది. టీ పెట్టి యిచ్చింది. శారిడాన్ వేసుకుని టీ త్రాగిన తర్వా అరవింద కాస్త తేరుకుంది.

అప్పుడు ఆఫీసులో జరిగింది చెప్పింది. ఆ వుదంతం విని ముక్కున వేలేసుకుంది శ్రీదేవి.

జరిగిందేమిటంటే - అరవింద రోజులాగానే ఇవాళ పదకొండు గంటలకు పిల్లకు పాలిచ్చి రావాటానికి సెంటరుకు బయలుదేరబోయింది ఆఫీసరు వెళ్ళటానికి వీళ్ళేదన్నాడు. చేతిలో వున్న అర్జంటుపని పూర్తిచేసి వెళ్ళమన్నాడు. అవతల నా పిల్ల ఏడుస్తోందని అరవింద గట్టిగా అంది. (బహుశా పెడసరంగా అని వుంటుంది.) ఆఫీసరుకు తిక్కరేగి వుంటుంది. అలా రూల్‌గా మాట్లాడితే నీవు అసలు ఎప్పుడూ వెళ్ళటానికి వీల్లేదన్నాడు. అరవిందా, ఆమెతోపాటు ఆమె సెక్షన్‌లో వున్న మిగతా ఆడవాళ్లూ ఆఫీసరుతో 'మధ్య మధ్యలో వెళ్ళి మా పిల్లలకు పాలిచ్చి రావటం మా జన్మహక్కు, అన్నట్లుగా వాదించారు. (మిగతా ఆడవాళ్ళలో ఇంకా పెళ్ళికాని వారు, పిల్లలులేని తల్లులు వుండవచ్చు. అది వేరే సంగతి!) ఆ ఆఫీసరు మొండి ఘటమయి వుంటాడు, వెంటనే అరవిందకు చేతికి ఒక మెమోకూడా ఇచ్చాడు. విషయం కాగితాల మీదకు వెళ్ళిన తర్వాత అసలు వెళ్ళటానికి వీలులేదు, అందువల్ల ఈ రోజు

వుదయం, మధ్యాహ్నం కూడ పాలు ఇవ్వటానికి కుదురలేదు. ఫలితం అరవింద పాలరొమ్ములు నిండిపోయి, బరువెక్కి గడ్డలాగా నలుపెక్కి బాధించటం మొదలుపెట్టాయి. సాయంత్రానికి తలనొప్పి, జ్వరం ముంచుకొచ్చాయి. సీతాపతికోసం కూడ చూడకుండా ఆఫీసరు పోయిన వెంటనే పిల్లను భుజాన వేసుకుని ఆటోలో యింటికి వచ్చేసింది.

శ్రీదేవికి రకరకాలయిన ఆలోచనలు వచ్చాయి. ఇంతలో సీతాపతి వచ్చాడు. విషయం తెలుసుకొని ఆ ఆఫీసరు మీద కారాలూ మిరియాలు నూరాడు. యూనియన్‌లో పెట్టిస్తానన్నాడు. (అతను పన్జేస్తున్నది వేరే ఆఫీసులో) స్త్రీ సంక్షేమ శాఖ మంత్రిణితో చెప్పుతానన్నాడు. అవసరమయితే ఇందిరాగాంధీకే రిపోర్టు చేస్తానన్నాడు. చిందులు త్రొక్కి చివరికి అరవిందను ఆ వీధిలో వున్న డాక్టరు దగ్గరకు తీసికెళ్ళి ఇంజక్షను చేయించి తీసికొచ్చాడు. ఇంకా ఏదో మందులు కావాలంటే షాపులో కొనుక్కొస్తానని వెళ్ళాడు.

అతను వెళ్ళిన తర్వాత మరొకామె వచ్చింది. ఎలా వచ్చింది పెళ్ళికెళ్ళబోతున్న పేరంటాలులాగో, మొదటిరాత్రి గదిలోకి వెళ్ళబోతున్న కొత్తపెళ్ళికూతురులాగో, డ్రీమ్ సీన్ షూటింగులో నటించబోయే సిన్మాతారలాగో పెద్ద పట్టు చీరతో, సర్వాలంకారాలలో కళ్ళు చెదిరిపోయే ఫుల్ మేకప్‌లో వచ్చింది.

ఆమెకూడా ఆడ యన్జీవోనే. అరవింద ఆఫీసులోనే మరో సెక్షన్‌లో మరో బిల్డింగ్‌లో పనిచేస్తోంది. ప్రక్క వీధిలో వుంటుంది. ఆమెకు ఈ వుదంతం ఇందాక బస్టాండ్‌లో తెలిసిందంట. వివరాలు అడగటానికి, సానుభూతి తెలుపటానికి వచ్చిందంట.

అంతా విని కళ్ళు ఆర్పుకుంటూ చేతులు త్రిప్పుతూ వూరికే ప్రతిమాటను సాగదీస్తూ మాట్లాడడం మొదలు పెట్టింది. ఈ 'త్రిప్పులాడి' ఆఫీసులో ఎలా పనిచేస్తోందా అని శ్రీదేవికి అనుమానం వచ్చింది. ఇంకాసేపు ఆమె మాటలు విన్నాక ఆ అనుమానం కాస్తా తీరిపోయింది.

"...... విషయాన్ని ఇంతదాకా ఎందుకు రానిచ్చావోయ్? మనం ఆఫీసులో పనిచేస్తున్నామంటే ఎందుకు? గొడ్డు చాకిరీ చెయ్యటానికి కాదు. అందరితో పోట్లాడి మన హక్కులు తేల్చుకోటానికి కాదు. ఏదో అలా అలా కాలక్షేపం చేసి ప్రతి ఫస్టుకూ బెస్టుగా ఆ జీతం డబ్బులు చేజిక్కించుకుని మన మన సంసారాలను హాయిగా, దర్జాగా గడుపుకునేందుకు అనువయిన సాధనాలు ఈ ఆఫీసులూ, ఈ వుద్యోగాలూ. అందుకు ఎక్కడి కక్కడ నేక్‌గా నెట్టుకు రావటమే! నిజంగా అంతేనండి, మీ పేరేంటోనాకు తెలియదు! అందాక ఎందుకు, మా ఆఫీసులో ఒక అకౌంటెంట్ వున్నాడు, ఆడవాళ్ళు కాస్త నవ్వుతూ, మరికాస్త కులుకుతూ మాట్లాడితే ఐస్ అయిపోతాడు. కాస్త నవ్వుతూ మాట్లాడినంత మాత్రాన మనకు పోయేది లేదు. వాడికి వచ్చేదీ లేదు. వచ్చేవి మనం అడిగినప్పుడల్లా పర్మిషన్లూ, లీవులున్నూ!......"

- ఈ ధోరణిలో మాట్లాడింది. అబ్బ, ఉద్యోగం అంటే ఎన్నెన్ని చెయ్యాలిరా బాబూ! అనుకుంది, శ్రీదేవి.

వచ్చినామె తిరిగి వెళ్తుతుండగా సీతాపతి బయటినుంచి వచ్చాడు.

లోపలికి వస్తూ, "మీ స్కీముల లక్ష్మి ఏవంటుంది?" అన్నాడు.

'స్కీముల లక్ష్మి' ఏంటన్నట్లు ఆశ్చర్యంగా చూచింది శ్రీదేవి.

"అవును చెల్లాయి! ఈవిడగారిపేరు స్కీముల లక్ష్మి ఎందుకో తెలుసా? ఫస్టు తారీకున జీతం తీసుకుంటుందా - అందులోంచి ఒక్క రూపాయా కూడా ఇంటికి తీసికెళ్ళదు, స్టీలు సామాను స్కీమూ బీరువాల స్కీమూ, టేబిల్ ఫ్యాన్స్ స్కీమూ, నెక్‌లెస్‌ల స్కీమూ, పట్టుచీర్ల స్కీమూ ఇలా ఎన్నో స్కీములకి ఇన్‌స్టాల్‌మెంట్స్ కింద కట్టేసి వుత్తచేతులతో యింటికి పోతుంది-"

"మరి ఇల్లు గడిచేది ఎలా?" అంది శ్రీదేవి అమాయకంగా.

"వుద్యోగాలు చేసే ఆడవాళ్ళంతా యిల్లు గడవకే చేస్తున్నారా ఏంటి? వాళ్ళాయనకు మంచి జీతం వస్తుంది. పైగా రెండు చేతులతో 'పై డబ్బులు' సంపాదిస్తాడు. వీళ్ళకు గుడివాడ తాలూకాలో కాలవక్రింద మాగాణి పొలం పది ఎకరాలుంది. యిల్లు గడవకేం దొబ్బుడాయా?" అన్నాడు.

ఆ రాత్రి భోజనాలయిన తర్వాత శ్రీదేవికి ఇంటర్వ్యూ వచ్చిన డిపార్ట్‌మెంటు, ఉద్యోగం మిగతా వివరాలన్నీ అడిగాడు సీతాపతి.

"అయితే పెద్ద రికమండేషన్ మీదే వచ్చావన్నమాటా! అంతే అమ్మాయి, రికమండేషన్లు తేకపోతే వుద్యోగాలు రావు. మీ వదిన వుద్యోగానికి చాల తంటాలు పడ్డాను. మా ఊళ్ళో సారాకొట్టు గౌరమ్మ రికమెండ్ చేస్తేనే ఆ మినిష్టరు గారు స్వయంగా కల్పించుకుని ఈ వుద్యోగం యిప్పించాడు మరి-" అన్నాడు సీతాపతి ఆవలిస్తూ.

* * *

మార్నాడు అరవింద ఆఫీసు కెళ్ళలేదు యింట్లోనే వుండిపోయింది.

శ్రీదేవికి ఇంటర్వ్యూ కెళ్ళటానికి టైం దగ్గర పడుతూంది. ఆమె హడావుడిగా స్నానానికి బయలుదేరింది. బాత్‌రూంలో అంతకుముందే దూరి ఎవరో స్నానం చేస్తున్నారు.

శ్రీదేవి అసహనంగా బయట తచ్చట్లాడుతూంది. మరో అయిదు నిమిషాలకు తలుపు తెరుచుకుంది. సన్నగా ఎత్తుగా అందంగా వున్న యువతి బయటికి వచ్చి శ్రీదేవికి 'సారీ' చెప్పి వెనుకవైపు వున్న పాత పెంకుటింట్లోకి వెళ్ళిపోయింది. నిన్న తను స్నానంచేస్తూ విన్నది ఈ అమ్మాయి గొంతే అయివుంటుందనుకుంది.

శ్రీదేవి స్నానం చేస్తూండగా మళ్ళీ ఆ అమ్మాయి గొంతు వినిపించింది. "అమ్మా! బస్సు చార్జీలకు ఒక్క రూపాయి కావాలే!" అంది. ఆ తల్లి దగ్గుతూ ఏదో గొణిగింది.

"పోనీ అర్ధరూపాయి ఉన్నా ఫర్వాలేదే! మళ్ళీ వచ్చేటప్పుడు నడిచి వస్తాను."

ఆ రోగిష్టామె దగ్గుతూ ఏమన్నదో వినిపించలేదు. దగ్గు తగ్గాక అన్న మాటలు వినకుండానే శ్రీదేవి స్నానం పూర్తి చేసుకుని లోపలికి వచ్చేసింది.

-శ్రీదేవి ఇంటర్వ్యూ జరిగే ఆఫీసుకెళ్ళేసరికి చాలా ఆలస్యమయిపోయింది. తెలియక ఒక ఆఫీసుకెళ్ళవలసింది మరో ఆఫీసుకెళ్ళింది. టాక్సీ చార్జీలే పన్నెండు రూపాయలు దాటింది.

టాక్సీ దిగి విసవిసా ఆఫీసరు రూంలోకి వెళ్ళింది. తను ఫలాన అని చెప్పింది. ఆ ఆఫీసరుకు తన బట్టతల మీద కనిపించని 'వుంగరాల చెయ్యి' ఏదో మొత్తినట్లయింది!

"ఏ. శ్రీదేవి నీవేనా? మినిష్టరుగారి దగ్గర్నుంచి మళ్ళీ ఇందాక కూడా నీ గురించే ఫోను వచ్చింది."

శ్రీదేవి గర్వంగా చూచింది.

"ఇంత ఆలస్యంగా వచ్చావేం తల్లీ? ఇంటర్వ్యూలు పూర్తి అయ్యాయి. ఇంత వరకు నీవు రాకపోతే ఇక రావేమో అనుకున్నా, అందుకనే ఒక కేండిడేట్‌ను పెండింగ్‌లో పెట్టి వుంచా-" అన్నాడు.

ఎందుకు ఆలస్యమయిందో శ్రీదేవి చెప్పింది. ఆయన చాల నొచ్చుకున్నాడు.

"సరే, నీవు వచ్చావుగా! ఇక ఆ కేండిడేట్‌ను పంపించేస్తా-" అని బెల్ నొక్కాడు. ప్యూను వచ్చాడు.

"బయట వుంది చూడు, ఆ అమ్మాయి -ఆ ఆ- సీతే- ఆమెను లోపలికి పంపించు."

ఆ అమ్మాయి వచ్చేలోపల తన టేబిల్‌గ్లాసు కిందవున్న శ్రీరాముడి ఫోటో వంక చూస్తూ కూర్చున్నాడు. పాపం ఆయనకు పాపభీతి వుందికాని ఏంచేస్తాడు? మామూలు ఆఫీసరు. తన చేతుల్లో ఏముంది? అంతా రాజకీయ నాయకుల చేతుల్లో వుంది. తనే వాళ్ళ చేతుల్లో వున్నాడు. ఇంత పెద్ద దేశమే వాళ్ళ చేతుల్లో వుండగా లేంది ఇక తనెంత? అందుకే తన అంతరాత్మకు వ్యతిరేకంగా ఏదైనా పని చేయాల్సి వచ్చినప్పుడల్లా టేబుల్ గ్లాస్ క్రింద వున్న ఆ రాముడి ఫోటోకి 'నా చేతుల్లో ఏమీ లేదు రామా!' అని విన్నవించుకున్నట్లుగా రెండు చేతులా జోడించి మరీ దణ్ణం పెట్టుతాడు. ఇప్పుడూ అదే చేశాడు.

లోపలికి వచ్చిన అమ్మాయిని చూచి కుర్చీలో కూర్చున్న శ్రీదేవి అదిరిపడింది. ఆ అమ్మాయి ఎవరోకాదు. పొద్దుట స్నానం గది దగ్గర 'సారీ' చెప్పిందే - సన్నగా, ఎత్తుగా, అందంగా వున్న యువతి - ఆమే ఈమె! అరవింద వాళ్ళ యింటి వెనక పాత పెంకుటింట్లో వుంటున్నామె! ఆమె సర్టిఫికెట్స్ మళ్ళీ ఆమెకు తిరిగి యిస్తూ,

"సారీ అమ్మాయి! ఫోన్ మీద హెడ్డాఫీసువార్ని అడిగేను. ఈ ఉద్యోగానికి గ్రాడ్యుయేట్స్ అక్కర్లేదన్నారు. ఇక నీవు వెళ్ళొచ్చు-" అని అన్నాడు ఆ బట్టతల ఆఫీసరు.

పాపం, ఆ అమ్మాయి నీళ్ళుకారి పోయింది; నెత్తిన పిడుగుపడ్డట్టు మొగం పెట్టింది. వెళ్ళుతూ శ్రీదేవివంక అదొక మాదిరిగా చూచి వెళ్ళింది.

బట్టతల ఆఫీసరు మళ్ళీ 'ఆ రాముడికి' దణ్ణం పెట్టాడు.

"పాపం ఫస్ట్‌క్లాసులో బియ్యే పాసయింది. నీవు రావేమో ఆ అమ్మాయికి ఈ ఉద్యోగం యిద్దామనుకున్నా. ఇంకెందుకు - నీవు వచ్చావుగా!" అన్నాడు.

"మరి నాకు ఆర్డర్సు-"

"విజయవాడకే పంపిస్తాం. నీకు పోస్టింగు కూడా విజయవాడ ఆఫీసులోనే! అక్కడున్న వాళ్లెవర్నియినా లేపేసి నిన్ను వెయ్యమని మినిష్టరుగారు చెప్పారు." అని ఏడుపో నవ్వో తెలియని ఒక నవ్వు నవ్వి, "మీ నాన్నగారూ ఆ మినిష్టరుగారూ చిన్ననాటి స్నేహితులంటగా!" అన్నాడు.

"అవునండి, మా నాన్న లేకపోతే అసలు ఆయన మినిష్టరయ్యేవాడే కాదు. వస్తానండి! తొందరగా ఆర్డర్లు పంపిస్తారుగా-" అని వచ్చేసింది.

బట్టతల ఆఫీసరు పాపం చెంపలు వాయించుకుని మళ్ళీ, 'ఆ రాముడు'కి ఇంకోసారి దణ్ణం పెట్టుకున్నాడు.

శ్రీదేవికి చాల ఆనందంగా వుంది. తనొచ్చిన పని ఇంత సులువుగా అవుతుందనుకోలేదు. ఆ ఆఫీసునుంచి నేరుగా అబిడ్స్‌కు వెళ్ళింది. తనకు చీరలూ, గాజులూ, టాయిలెట్ సామాన్లూ, సూరిబాబుకు నెక్‌టైలు-అవీ, ఇవీ అన్నీ తన ఇష్టం వచ్చినట్లు కొనేసింది; మూడు పచ్చకాగితాలు ఖర్చుచేసింది. బస్సు డిపోకి వెళ్ళి ఆ రాత్రికి సూపర్ డీలక్స్ బస్సులో సీటు రిజర్వు చేయించుకుంది.

టాక్సీ ఎక్కి యింటికి బయలుదేరింది. వేనిటీ బాగ్‌లోంచి టాయిలెట్ అద్దం తీసి మొగం చూచుకుంది. ముంగురులు సవరించుకుంటుంటే ఆ అద్దంలో సీత బొమ్మ కనిపించి నట్లనిపించింది;

ఆఫీసరు గదిలో తనవంక ఆమె చూచిన చూపు గుర్తుకు వచ్చింది. ఆ పిల్లకు రావల్సిన ఉద్యోగాన్ని తను కొట్టేశానా అని ఒక్క క్షణం అనిపించింది......

తనకు ఉద్యోగం వచ్చినట్లు తెల్సుకుని అరవింద ఆనందించింది. తను బజారులో కొనుక్కొచ్చిన స్వీట్స్ ఆమె వద్దన్నా నోట్లో కుక్కింది. అరవింద కూతురుకు తను ఇందాక కొన్న కొత్త గౌను తొడిగి ముద్దులాడింది.

తను బట్టలు మార్చుకుంటుండగా దొడ్డి వయిపునుంచి గోలగా అరుపులు, కేకలు, ఏడ్పులూ వినిపించాయి. అరవింద తలుపులు తీసుకుని దొడ్లోకి వెళ్ళింది, ఆ గొడవేందో చూద్దామని. తను సూట్‌కేసు సర్దుకుంటూ కూర్చుంది.

కొద్దిసేపటికి బయటి గొడవ తగ్గిపోయింది. అరవింద తిరిగి వచ్చింది. "పాపం, వెనుకింట్లో ఉంటున్న సీత చావటానికి వురేసుకోబోయింది. ఇంతలో ఆ తల్లికి మెలకువ వచ్చి చూచి కేకలు పెట్టింది. సమయానికి ఆ తల్లి చూచి వుండకపోతే ఈ పాటికి నిండు ప్రాణాలు నిలువునా పోయి వుండేవి; నట్టింట శవం వుండేది-" అంది జాలిగా.

"ఆత్మహత్య చేసుకోవటం దేనికి?" వణుకుతున్న కంఠంతో మెల్లగా అడిగింది శ్రీదేవి.

"దేనికేముంది? దారిద్ర్య బాధలకు తట్టుకోలేక"- అంటూ వాళ్ళ కుటుంబ పరిస్థితిని గురించి చెప్పింది.

సీతతండ్రి ఏదోచిన్న ఫ్యాక్టరీలో చిన్న గుమస్తా ఉద్యోగం చేస్తూండేవాడు. ఈ మధ్యే ఒక సంవత్సరం క్రింద అకస్మాత్తుగా గుండె ఆగి చనిపోయాడు. తండ్రిపోయిన దగ్గర్నుంచి తల్లి కూడా మంచం పట్టింది. సీత కాక ఇంక ఇద్దరు చిన్నపిల్లలున్నారు. ఇంట్లో ఉన్న చిన్నమూ-చితకా అమ్ముకుని తింటూ కాలక్షేపం చేస్తున్నారు. సీత సంవత్సరం నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తూనేవుంది. బియ్యే డిగ్రీ పట్టుకుని ఆఫీసుల చుట్టూ కాళ్ళరిగిపోయేటట్లు తిరుగుతూనే వుంది. కాని, ఫలితం శూన్యం.

"-ఇవ్వాళ ఉదయం కూడా ఏదో ఇంటర్వ్యూకు వెళ్ళి వచ్చిందంట.... ఇకెటూ తనకు ఉద్యోగం రాదనుకుందో ఏమో, ఈ బాధలు పడలేక జీవితం మీద విసిగిపోయి ఆఖరికి ఈ అఘాయిత్యానికి తలబడింది....." అంది అరవింద.

అరవింద చెప్పినదంతా వినేసరికి శ్రీదేవికి తల తిరిగిపోయింది. తల నొప్పిగా వుందని కళ్లు మూసుకుని పడుకుని ఉండిపోయింది.

అరవింద కూడా పిల్లకు పాలిస్తూ వారపత్రికలో కొత్త సీరియల్ చదువుతూ కూర్చుంది. ఆ సమయానికి ఏదో సానుభూతిగా మాట్లాడింది కాని ఆ మరుక్షణంలోనే సీతను గురించి గాని అసలు సమస్యను గురించి గాని ఆలోచించడం మానివేసింది. అసలు ఆ విషయమే మర్చిపోయింది. మామూలు ధోరణిలో పడిపోయింది. ఆమె కూడా అందరి లాంటిదే!

కాని శ్రీదేవి మాత్రం సీతను గురించే ఆలోచిస్తూంది. తనకు కళ్లు మూసుకున్నా సీత మొగమే కనిపిస్తోంది. ఆలోచనలతో తల బరువెక్కిపోయింది. గుండెల్లో ఏదో తెలియని దిగులు క్షణక్షణానికి పేరుకుపోతూంది; బరువు పెరిగి పోతూంది.

అలా కొద్దిసేపు తనలో చెలరేగుతున్న సంఘర్షణల తాకిడికి నలిగిపోయి చివరికి ఒక నిర్ణయానికొచ్చినట్లు లేచి కూర్చుంది. తేలిగ్గా గాలి పీల్చుకుంది. తలుపు తీసుకుని సీత ఇంటివయిపు నడిచింది.

రెండు కాళ్ళ మధ్యన తల పెట్టుకుని కుమిలి కుమిలి ఏడుస్తోన్న సీత మధ్యలో తల ఎత్తి గుమ్మంలో నిలబడ్డ శ్రీదేవిని చూచి ఆశ్చర్యపోయింది.

శ్రీదేవి లోపలికెళ్ళి సీత ప్రక్కనే నేలమీదే కూర్చుంది. ఆమె తల మీద చెయ్యిపెట్టి అనునయిస్తోన్నట్లు నిమిరింది.

"ఆ ఉద్యోగం నీకు వస్తుంది. దిగులు పడవాకు" అంది మెల్లగా.

ఆమె ఏం చెప్తుతోంది మొదట్లో అర్థం కాక, అర్థం అయ్యాక నమ్మలేక, నమ్మేక కృతజ్ఞతతో నోటమాటరాక వూరికే అలా బొమ్మలాగా చూస్తూండిపోయింది సీత.

"అలా చూస్తావేంటి? నిజమే - లే, తొందరగా ఆఫీసుకెళ్లుదాం-" అని తొందరపెట్టి సీతను తీసికొని టాక్సీలో బట్టతల ఆఫీసరు దగ్గరకు బయలు దేరింది.

* * *

-సీతాపతి కళ్ళు ఇంతవి చేసుకుని వింతగా చూస్తూ, "ఏంటి చెల్లాయి! ఉన్నట్లుండి ఇలా 'త్యాగమయి'వి, 'కరుణామయి'వి అయిపోయావు?" అన్నాడు నాటకీయంగా.

"మినిష్టరుగారు సిఫార్సు వెంటపెట్టుకుని ఉద్యోగం కోసం ఇంతదూరం వచ్చింది ఈ పెంకుటింటి సీతకు ఉద్యోగం ఇప్పించటానికా?" అంది అరవింద ఆశ్చర్యంగా.

శ్రీదేవి కొద్దిగా సిగ్గుపడింది ఈ పొగడ్తలకు. ఆ తర్వాత మెల్లగా ఇలా అంది: "అవునొదినా, నిజంగా మనం ఉద్యోగాలు చెయ్యటం అంత అవసరమా? భర్తల కొస్తున్న జీతంతో, మనకున్న

ఆస్తిపాస్తులతో మనం సుఖంగా జీవించలేమా? ఆర్థికంగానూ, అన్నివిధాలుగానూ లక్షణంగా వున్న మనం ఉద్యోగాల కోసం సీతలాగా కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న వారితో పోటీపడుతున్నాం. ఈ పోటీలో మనం మన డబ్బుతో, సిఫారస్సులతో (ఎక్కువ విద్యార్హతలున్న) సీతలాంటి వారికి దక్కవల్సిన ఉద్యోగాలను తన్నుకుపోతున్నాం. మనలాంటివాళ్ళం ఉద్యోగాలు చెయ్యటం కాలక్షేపం కోసం, విలాసం కోసం; కాని అది సీతలాంటి వాళ్ళకు జీవన్మరణ సమస్య. మనం ఆ జీతండబ్బులతో ఇంకా ఎన్నో విలాస వస్తువులు కొనుక్కొని ఆడంబరంగా, దర్జాగా వుంటాం; కాని వాళ్ళ రెండుపూటలా ఇంత తిండితిని పోతున్న ప్రాణాలను నిలబెట్టుకుంటారు-"

మళ్లీ శ్రీదేవే అంది: "ఏమో బాబూ, ఈ సీత పరిస్థితీ, ఉద్యోగాలు చేస్తున్న మీ పరిస్థితీ కళ్లారా చూశాక నాకు ఉద్యోగం చేయాలనిపించటం లేదు. ఇలాంటి సీతలు దేశంలో ఇంకెంతమంది వున్నారో?"

సీతాపతి చప్పట్లు చరిచి, "సెహబాష్‌గా చెప్పావు చెల్లీ! ఏమండోయ్ శ్రీమతిగారూ! మరి, మీరేమంటారు?" అన్నాడు.

అరవింద ఆలోచిస్తూ వుండిపోయింది....

శ్రీదేవి సూట్‌కేసు చేత్తో పట్టుకుంది.

- 'యువ' మాసపత్రిక *(1972)*

★